# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- దేవరాపల్లి ఆశ్రమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో బాధ్యులపై చర్యలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

- బడ్జెట్‌లో డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే ప్రకటించడంతో అనేక డేటా సెంటర్లు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

- వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలు చేపడుతున్నాయని శాసన సభ ఉపసభాపతి కె. రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు.

- ఆలయాల ఆగమ విధానాల్లో దేవదాయ శాఖ అధికారులు జోక్యం చేసుకోవద్దని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు.

========================

పోలవరం జిల్లా రంపచోడవరంలోని దేవరాపల్లి ఆశ్రమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఘటనపై రేపటి లోగా పూర్తి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు కారకులపై శాఖా పరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, డయేరియా లక్షణాలు కనిపించటంతో హుటా హుటిన మారేడుమిల్లి, రంపచోడవరం ఏరియా ఆసుపత్రులకు తరలించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

========================

ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి అధిక ప్రయోజనం కలగనుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. విశాఖపట్నంలో ఈరోజు కేంద్ర బడ్జెట్ ప్రచార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే ఇస్తున్నారని.. దీంతో ఉద్యోగాలు

పెరుగుతాయని.. తద్వారా అనేక డేటా సెంటర్లు రాష్ట్రానికి వచ్చే అవకాశముంటుందన్నారు. రక్షణ బడ్జెట్‌ను గత ఏడాది కంటే 21 శాతం పెంచి, లక్షా 80 వేల కోట్ల రూపాయల నుండి 2 లక్షల 20 వేల కోట్ల రూపాయలకు చేర్చారని పేర్కొన్నారు. రైల్వే బడ్జెట్‌లో 10 శాతం పెరుగుదల ఉందని, ఏడు హై-స్పీడ్ రైల్వే కారిడార్లను నిర్మిస్తున్నారని, వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు కూడా లబ్ధి చేకూరుతుందని వివరించారు. దేశంలో సామాన్యుల నుంచి వ్యాపారులు వరకు అందరికీ ఉపయోపడేలా.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలు చేపడుతున్నాయని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణం రాజు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఈరోజు ఎస్సీ సబ్ ప్లాన్ కు సంబంధించి 28 లక్షల రూపాయల విలువైన బ్యాటరీ స్ప్రేయర్లను రఘురామకృష్ణం రాజు నియోజకవర్గంలోని 400 మంది రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధిక దిగుబడులు సాధించాలంటే వ్యవసాయ పనిముట్లు కూడా నూతన సాంకేతికతతో ఉండాలని, ఈ దిశగా ప్రభుత్వం వీటిని అందిస్తుందని తెలిపారు.

========================

పాకాల బీచ్ ఫెస్టివల్ ను ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండల పరిధిలోని పాకాల బీచ్ లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబుతో కలిసి మంత్రి ఈరోజు బీచ్ ను శుభ్రం చేశారు. అనంతరం పాకాల బీచ్ ఫెస్టివల్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పాకల బీచ్ ఫెస్టివల్ లో హెలికాప్టర్ రైడింగ్, బోట్ రైడింగ్, పారా గ్లైడింగ్, బీచ్ వాలీ బాల్, బీచ్ కబడ్డీ వంటి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

విరామం

========================

మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలనూ తీసుకోవాలని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని ఈరోజు జరిగిన శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి పి. నారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ... ఆలయాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని సూచించారు. ఆలయాల ఆగమ విధానాల్లో దేవదాయ శాఖ అధికారులు జోక్యం చేసుకోవద్దని ఆదేశించారు. ఆగమ పండితుల సూచనలు, సలహాలతో అధికారులు ముందుకెళ్లాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

========================

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈరోజు నుండి 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రమేష్ నాయుడు మాట్లాడుతూ... శివరాత్రి బ్రహ్మోత్సవాలకు 15 లక్షల మంది భక్తులు దర్శనానికి వస్తారని అధికారులు అంచనా వేశారన్నారు. అలాసే భక్తులకు 40 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. శివసేవకుల ద్వారా క్షేత్రంలో 12 చోట్ల హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని, ఇప్పటికే క్షేత్రానికి వచ్చే భక్తులకు సకల ఏర్పాట్లు చేశామని చైర్మన్ తెలిపారు.

========================

చిత్తూరు జిల్లాలోని పౌల్ట్రీ రైతులు ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా (బర్డ్ ఫ్లూ) వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. పౌల్ట్రీ పక్షుల్లో అధిక సంఖ్యలో మరణాలు సంభవించినట్లయితే వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారులకు, జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా వ్యాధి పక్షి నుండి పక్షికి మాత్రమే వ్యాపిస్తుందని, ఇది పక్షుల నుండి మనుషులకు వ్యాపించదని కలెక్టర్ స్పష్టం చేశారు.

========================

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు పట్టణంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 8 లక్షల 72 వేల 614 రూపాయల విలువైన 14 చెక్కులను మంత్రి లబ్ధిదారులకు ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు.

========================

టీ-20 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా అఫ్గనిస్థాన్ తో చెన్నై వేదికగా ఈరోజు జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 183 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ముంబైలోని వాంఖెడే స్టేడియం వేదికగా ఇంగ్లాండ్, నేపాల్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ లో ఇంగ్లాండ్... నేపాల్‌కు 185 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. బ్యాటింగ్ ప్రారంచిన నేపాల్ 16 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. అదే విధంగా కొలంబో వేదికగా శ్రీలంక, ఐర్లాండ్ జట్ల మధ్య రాత్రి 7 గంటలకు క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

========================

రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ లేకుండా పటిష్టమైన ప్రమాణాలను పాటించాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రకాశం జిల్లా శాంతి నగర్ వద్ద చెన్నై-కోల్ కత్తా జాతీయ రహదారిలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన ఈరోజు పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా రహదారి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని తెలిపారు.
పీటీసీ ప్రకాశం

========================
========================